

అధిక ఫీజును నియంత్రించాలి

అధిక ఫీజు వసూలు చేస్తున్న ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. - 10లో



కుళ్లిపోయిన గుడ్లు !

అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిన, నాసిరకం గుడ్లను సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. - 10లో

గరిష్టం/కనిష్టం 31°/25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఈదురు గాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దీపక్ తివారీ పాత్ర అమోఘం



బదిలీపై వెళ్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీని సన్మానిస్తున్న కలెక్టర్

సాక్షి, యాదాద్రి : జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలులో స్థానిక సంస్థల అదనపు కలెక్టరు దీపక్ తివారీ పోషించిన పాత్ర అమోఘమని కలెక్టరు పమేలా సత్పతి కొనియాడారు. బదిలీపై ఆసిఫాబాద్ జిల్లాకు వెళ్తున్న దీపక్ తీవారీకి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, హరితహారం, స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛభార్, పన్నుల వసూలు, ఉపాధిహామీ పనులు, తెలంగాణ క్రీడా ప్రాంగణాల నిర్మాణం, మన ఊరు – మన బడి, బుధవారం బోధన కార్యక్రమాల్లో జిల్లాను ముందంజలో నిలుపడంలో దీపక్ తివారీ విశేష కృషి చేశారని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పదవి ప్రత్యేకమైనదన్నారు. తనకు సహకరించిన జిల్లా కలెక్టర్, శాఖాధిపతులు, ఉద్యోగులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు, ఏసీపీలు సైరెడ్డి వెంకట్‌రెడ్డి, సైదులు, జిల్లా ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు మందడి ఉపేందర్‌రెడ్డి,టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ జగన్‌మోహన్‌ప్రసాద్, పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

5న స్పాట్ అడ్మిషన్లు

భువనగిరి : పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో బైపీసీ విభాగంలో ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్ ద్వారా ప్రవేశం కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీరాం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రటనలో తెలిపారు. పదో తరగతిలో 8 జీపీఏ ఆపై సాధించిన విద్యార్థులు ఈ నెల 5న కళాశాలలో నేరుగా హాజరుకావాలని కోరారు. ఎస్సీ కేటగిరీలో 16, ఎస్టీ 2, ఓసీలో 1, బీసీలకు 3 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఉదయం 11 గంటలకు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

యాదాద్రి శివాలయంలో విశేష పూజలు



స్పటిక లింగానికి హారతినిస్తున్న పూజారి

యాదగిరిగుట్ట : యాదాద్రి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు చేపట్టారు. శ్రీస్వామి వారికి నిత్యపూజలు, రుద్ర హవనం నిర్వహించారు. మహాశివుడికి అభిషేకం, అర్చనలు గావించారు. గర్భాలయం, ముఖ మండపంలోని స్పటికలింగానికి బిల్వా పత్రాలతో పూజలు చేసి హారతినిచ్చారు. శివపార్వతుల కల్యాణ వేడుక, సేవోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక యాదాద్రీశుడి ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. వివిధ పూజల ద్వారా నిత్యాదాయం రూ.20,51,854 సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేయొద్దు



మాట్లాడుతున్న దాసరి తిరుమలేష్

మోత్కూరు : కుల వివక్షత చూపినా, దూషించినా, దాడులు చేసినా అట్రాసిటీ చట్టాన్ని వినియోగించుకోవాలని, ఇతర ప్రయోజనాలకు వాడుకోవద్దని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ దాసరి తిరుమలేష్ పేర్కొన్నారు. మోత్కూరు మండలంలోని పాడిచేడులో సోమవారం రెవెన్యూ శాఖ నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. గుడిలో, బడిలో తదితర సందర్భాల్లో వివక్ష పాటిస్తే ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం దళిత కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పేలపూడి మధు, ఎంపీటీసీ ధీటి సంధ్య, ఎస్ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ పరకాల శ్రీశైలం, గిర్దావర్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ అనసూయ, సింగిల్‌విండో డైరెక్టర్ జిట్ట లక్ష్మయ్య పాల్గొన్నారు.

యాదాద్రి రైల్వే స్టేషన్‌కు.. కొత్త హంగులు!

అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా సుందరీకరణ

- నృసింహుడి ఆలయ నమూనాతో రైల్వే స్టేషన్ ముఖద్వారం
- 6న వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ
- ఏర్పాట్లు చేస్తున్న రైల్వే అధికారులు



సాక్షి, యాదాద్రి : యాదాద్రి రైల్వే స్టేషన్ సరికొత్త హంగులు సంతరించుకోనుంది. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా అత్యున్నత ప్రమాణాలు, సౌకర్యాలతో తీర్చిదిద్దనున్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈనెల 6న వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకు సంబంధించి రైల్వే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఎంఎంటీఎస్ రెండో దశ కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే. రూ.320 కోట్లతో ఘట్కేసర్ నుంచి (రాయగిరి) యాదాద్రి వరకు రెండో దశ ప్రాజెక్టును పూర్తి చేస్తానని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఇందులో భాగంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఇటీవల యాదాద్రి రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. ఘట్కేసర్ నుంచి యాదాద్రి వరకు 33 కిలో మీటర్ల మేర అదనపు ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు.

రూ.24.5 కోట్లతో ఆధునీకరణ

అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా యాదాద్రి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. యాదాద్రి ఆలయ క్షేత్ర నమూనాతో రైల్వే స్టేషన్ ముఖ ద్వారం నిర్మించనున్నారు. ఎంఎంటీఎస్ నూతన లైన్ కోసం స్టేషన్‌ను తూర్పు వైపు విస్తరించనున్నారు. ఇందులో భాగంగా నూతన స్టేషన్ బిల్డింగ్ నిర్మాణం, ప్లాట్‌ఫాం ఎత్తు పెంపు, పైకప్పుల ఆధునీకరణ, ప్రయాణికులకు వెయిటింగ్ హాల్, మంచినీరు, టాయ్‌లెట్స్ పార్కింగ్ ఏరియా పనులను చేపట్టనున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న రైల్వే స్టేషన్‌లో నూతనంగా నిర్మించి ప్లాట్‌ఫాంలను అభివృద్ధి చేయనున్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న రేల్వే స్టేషన్లు భువనగిరి, బీబీనగర్, ఘట్కేసర్ స్టేషన్లలో అదనపు మౌళిక వసతులు కల్పిస్తారు.

రెండో దశలో కదలిక

2016 లో మంజూరైన ఎంఎంటీఎస్ రెండో దశ పనులు నిధులలేమితో నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించక ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.330 కోట్ల నుంచి రూ.430 కోట్లకు పెరిగింది. అయితే తమ నిధులతోనే యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగిస్తామని ప్రకటించి పనులకు శ్రీకారం చుట్టింది.

వంగపల్లి వరకు పొడిగింపు ప్రతిపాదన

యాదాద్రి (రాయగిరి) వరకు ఉన్న ఎంఎంటీఎస్ లైన్‌ను వంగపల్లి వరకు పొడిగించేందుకు రైల్వే శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. రాయగిరి రైల్వే స్టేషన్ ఇరుకుగా ఉన్నందున విస్తరించాల్సి ఉంటుంది.అయితే వంగపల్లి స్టేషన్ అనుగుణంగా ఉన్నందున అక్కడి వరకు ఎంఎంటీఎస్ పొడిగించే యోచనలో రైల్వే శాఖఉంది. వంగపల్లి నుంచి కూడా యాదాద్రి పుణ్యక్షేత్రం ఐదున్నర కిలో మీటర్ల దూరంలో ఉంటుంది.అయితే వంగపల్లి వరకు పొడిగించే విషయం ఇంకా ఫైనల్‌కాలేదని రైల్వే శాఖఅధికారి ఒకరు చెబుతున్నారు.

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది. ఇచ్చినమాట ప్రకారం ఎంఎంటీఎస్ యాదాద్రి రైల్వే స్టేషన్‌కు ఈనెల 6వ తేదీన ప్రధాని మోదీ శంఖుస్థాపన చేయనున్నారు. రైల్వేస్టేషన్ నిర్మాణం కోసం రూ.24.5 కోట్లు కేటాయించారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి నుంచి ఆదేశాలు అందాయి. యాదాద్రి నుంచి వయా ఆలేరు జనగామ వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించాలని రైల్వే మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశాం. కేంద్రం ఇప్పటికే బీబీనగర్‌లో ఎయిమ్స్ ఏర్పాటు చేసింది. ఏడాదిలోగా నూతన భవన సముదాయాన్ని ప్రారంభిస్తాం.

–పీవీ శ్యాంసుందర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కలెక్టర్ పమేలా సత్పతి బదిలీ

- నూతన కలెక్టర్‌గా వినయ్ కృష్ణారెడ్డి



వినయ్ కృష్ణారెడ్డి

సాక్షి యాదాద్రి : జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వానికి రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. ఆమె స్థానంలో నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న టి.వినయ్‌కృష్ణారెడ్డి రానున్నారు. కాగా పమేలా సత్పతి జిల్లా కలెక్టర్‌గా వచ్చి ఇటీవలే రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నారు. ఈ రెండేళ్ల కాలంలో పాలనలో తనదైన ముద్ర వేశారు.

ప్రజావాణికి 21 ఫిర్యాదులు

- అర్జీలను స్వీకరించిన కలెక్టర్
- సత్వరమే పరిష్కరించాలని ఆదేశం



బాధితుల సమస్యలు వింటున్న కలెక్టర్

భువనగిరిటౌన్ : ప్రజావాణి కార్యక్రమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారితో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదులను వేగంగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. వివిధ సమస్యలపై 21 వినతులు వచ్చినట్లు తెలిపారు.

వినతులు ఇలా..

- రాజకీయ జోక్యం లేకుండా దళితబంధు లబ్ధిదారులను ఎంపిక చేయాలని, దరఖాస్తుదారుల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని, కోరుతూ దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంకి మహేష్, ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల లింగస్వామి, కార్యవర్గ సభ్యులు ఇంజ హేమలత,మంచాల సైదులు, దాసరి అంజయ్య పాల్గొన్నారు
- ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణకు జిల్లా స్థాయిలో కమిటీ ఏర్పాటు చేయాలని ఆలిండియా పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొడారి వెంకటేష్ కలెక్టర్‌కు విన్నవించారు. డొనేషన్, ఫీజు, స్కూల్ యూనిఫాం, బుక్స్, టై, బెల్ట్‌ల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.
- జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఆర్థోపెడిక్, పాల్మోనాలజిస్ట్, మెదడు, గుండె సంబంధిత డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు అతహర్ కోరారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి అయినప్పటికీ డాక్టర్లు అందుబాటులో లేకపోవడం వల్ల రోగులు హైదరాబాద్‌కు వెళ్తున్నారని పేర్కొన్నారు.

హాజరుకాని అధికారులు

ప్రజావాణికి జిల్లా అధికారులంతా హాజరుకాలేదు. కొందరు వారి స్థానంలో సహాయకులను పంపించడంతో అదనపు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి సుదూర ప్రాంతాల నుంచి వస్తుంటారని, అలాంటప్పుడు జిల్లా అధికారులు హాజరుకాకుంటే ఎలా అని ప్రశ్నించారు. ఇకనుంచి తప్పనిసరిగా హాజరై రిజిస్టర్‌లో సంతకం చేయాలని ఆదేశించారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు



ప్రపంచ తల్లిపాల వారోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఉద్యోగులు

భువనగిరిటౌన్ : ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను మంగళవారం నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు. తల్లిపాల వారోత్సవాలపై సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ, జిల్లా వైద్యారోగ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమై చర్చించారు. తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. జిల్లాలో 5016 మంది గర్భిణులు సమోదై ఉన్నారని, వారితో పాటు బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పోస్టర్లు, చార్టర్స్ ద్వారా ప్రచారం చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బందితో ర్యాలీలు నిర్వహించాలని, జిల్లా, మండల సమాఖ్యల సభ్యులతో అవగాహన కలిపంచాలన్నారు. శుక్రవారం సభల ద్వారా తల్లిపాల ప్రయోజనాలపై వివరించాలని, కౌన్సిలింగ్ ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం తల్లిపాల ఆవశ్యత తెలిపే బ్రోచర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ అధికారి అన్నపూర్ణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ యశోద, సీడీపీఓ రేకల స్వరాజ్యం, శైలజ, సూపర్‌వైజర్లు, అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల ఏర్పాట్లు

సాక్షి, యాదాద్రి : సాధారణ ఎన్నికల ఏర్పాట్లు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పారదర్శకంగా జరుగుతున్నాయని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశమై పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భువనగిరి నియోజకవర్గ పరిధిలో లొకేషన్ మార్పు పోలింగ్‌స్టేషన్లు 12 ఉన్నాయన్నారు. ఇందులో భువనగిరి మండలంలో 7, బీబీనగర్ 2, భూదాన్‌పోచంపల్లి 2, వలిగొండ మండలంలో ఒకటి ఉన్నట్లు తెలిపారు. పేరు మార్పనున్న పోలింగ్ కేంద్రాలు భువనగిరి, బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయన్నారు. కొత్త పోలింగ్ స్టేషన్లు భువనగిరి మండలంలో 2, పోచంపల్లిలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

ఆలేరు నియోజకవర్గంలో..

లొకేషన్ మార్పు పోలింగ్ స్టేషన్లు 9 ఉన్నాయి. యాదగిరిగుట్ట మండలంలో 2, ఆలేరు 1, మోటకొండూరు 4, ఆత్మకూర్(ఎం)లో 2 ఉన్నాయి. పేరు మార్పునకు సంబంధించి 34 ఉన్నాయి. వీటిలో బొమ్మలరామారం మండలంలో 3, తుర్కపల్లి 6, రాజాపేట 3, యాదగిరిగుట్ట 10, ఆలేరు 4, మోటకొండూరు 1, గుండాల 5, ఆత్మకూర్(ఎం) 2 చొప్పున ఉన్నట్లు చెప్పారు. కొత్త పోలింగ్ కేంద్రాలు యాదగిరిగుట్ట, ఆత్మకూర్ (ఎం) మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయని తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు, ఏసీపీలు వెంకట్‌రెడ్డి, సైదులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బుద్ధుడి బోధనలు ఆచరణీయం

- ప్రొఫెసర్ హరగోపాల్



అష్టబుద్ధుల చెంత హరగోపాల్ కుటుంబ సభ్యులు

నాగార్జునసాగర్ : బుద్ధుడి బోధనలు నాటి, నేటి, భవిష్యత్ తరాలు ఆచరించదగినవని ప్రొఫెసర్ జి.హరగోపాల్ పేర్కొన్నారు. బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య ఆహ్వానం మేరకు సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి బుద్ధవనం సందర్శనకు వచ్చినట్లు ప్రొఫెసర్ హరగోపాల్ పేర్కొన్నారు. బుద్ధుడి పాదాల చెంత వారు పుష్పాంజలి ఘటించారు. అనంతరం జాతక కథల పార్కు, ధ్యాన బుద్ధ, స్థూప పార్కు, మహాస్థూపంపై చెక్కిన శిల్పాలను పరిశీలించారు. మహాస్థూపంలోని రెండవ అంతస్తులో గల అష్టబుద్ధులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధుడి చరిత్రనంతా శిల్పాల రూపంలో మహాస్థూపంపై చెక్కడంలో కఠోరమైన శ్రమ దాగి ఉందన్నారు. వీరికి బుద్ధవనం ఇన్‌చార్జి శ్యాంసుందర్‌రావు బుద్ధవనంలోని అన్ని విషయాలను వివరించారు. హరగోపాల్‌ను మెమోంటోతో సత్కరించారు.

హామీలను అమలు చేయాలి

- గుట్టలో సెర్ప్, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన
- 101 కొబ్బరికాయలు కొట్టి డిమాండ్లతో శ్రీస్వామి పాదాల చెంత వినతి



యాదగిరిగుట్టలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ, సెర్ప్‌ఉద్యోగులు

యాదగిరిగుట్ట : సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యాదగిరిగుట్ట పట్టణంలో సోమవారం సెర్ప్, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. వైకుంఠద్వారం వద్ద 101 కొబ్బరికాయలు కొట్టి, స్వామివారి పాదాల చెంత పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి శాఖ (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) జిల్లా జేఏసీ చైర్మన్ సంపత్‌కుమార్, గౌరవ సలహాదారులు వి.శ్యామల, కో చైర్మన్ నారాయణ మాట్లాడుతూ గత ఏడాది అసెంబ్లీ సమావేశాల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని, సెర్ప్ ఉద్యోగులకు కొత్త పే స్కేల్ 2023 ఏప్రిల్ నుంచి అమలు చేస్తామని ప్రకటించి ఇంకా అమలు చేయలేదన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖలో కొందరు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీరించి, పే స్కేల్ అమలు చేసి అదే శాఖలో పనిచేస్తున్న మరో విభాగమైన ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ , సెర్ప్ ఎఫ్‌టీఈ కాంట్రాక్టు ఉద్యోగులకు జీఓలను వర్తింప చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేర్వేరు నిబంధనలు, పే స్కేల్ ఇస్తూ ప్రభుత్వం వివక్షతో వ్యవహరిస్తుందన్నారు. ఉద్యోగుల ఫ్రెండ్లీగా పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్.. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్, ఎఫ్‌టీఈ కాంట్రాక్టు ఉద్యోగులకు సైతం పేస్కేల్ ఇవ్వాలని కోరారు. 2006 ఉపాధిహామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి ప్రతి జిల్లాలో డీఎస్‌సీ (జిల్లా సెలక్షన్ కమిటీ) ద్వారా వివిధ హోదాల్లో ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలు జరిగాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి శాఖలో వివిధ హోదాల్లో 3,874 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పని చేస్తున్నారని వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో కో చైర్మన్లు బి.రాజశేఖర్, కే.రమేష్, పి.వెంకటేష్, ఉపాధిహామీ అధికారులు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ పదవికి పెరుగుతున్న పోటీ

- ఠాక్రేను కలిసిన కసిరెడ్డి, నగేష్, జనగాం ఉపేందర్‌రెడ్డి



మాణిక్‌రావ్ ఠాక్రేకు వినతిపత్రం అందజేస్తున్న కసిరెడ్డి, డాక్టర్ నగేష్, జనగాం ఉపేందర్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే పలువురు నేతల పేర్లు తెరపైకి రాగా.. తాజాగా ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కుడుదుల నగేష్, పీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి డీసీసీ పదవి రేసులోకి వచ్చారు. ఈ ముగ్గురు సోమవారం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రేను కలిసి వినతిపత్రం అందజేశారు.

పెరుగుతున్న ఆశావహులు

కాంగ్రెస్ పార్టీకి అనిల్‌కుమార్‌రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన డీసీసీ పదవిని భర్తీ చేయాల్సి ఉంది. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పటికే అండెం సంజీవరెడ్డి పేరును సిఫారసు చేశారు. మరోవైపు కసిరెడ్డి నారాయణరెడ్డి పేరును సీనియర్ నేత కె.జానారెడ్డి సూచించారు. ఆయన సూచన మేరకు ఠాక్రేను కలిశారు. అలాగే పార్టీ ఆవిర్భావం నుంచి వివిధ హోదాల్లో పనిచేసిన తనకు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని జనగాం ఉపేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇక భూదాన్‌పోచంపల్లికి చెందిన పాక మల్లేష్‌యాదవ్ కూడా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించారు. పోటీ తీవ్రంగా ఉండడంతో అధిష్టానం ఆచితూచి వ్యవహరిస్తోంది.

సాంస్కృతిక పాఠశాలలో పోస్టులు భర్తీ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట పట్టణంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక విద్యా పాఠశాలలో ఖాళీ పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేసినట్లు ఈఓ గీతారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర సాంస్కృతిక విశ్వ విద్యాలయం న్యూఢిల్లీ వారు సాంస్కృతిక భాష అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన స్కీంలో యాదాద్రి దేవస్థానం పాఠశాల దరఖాస్తు చేసుకుందన్నారు. ఇందుకు గాను ఈ ఏడాది ఫిబ్రవరి 28న 32వ గ్రాంట్స్ కమిటీ ఆమోదం మేరకు ఆర్థిక సాయం మంజూరైనట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా సోమవారం విశ్వవిద్యాలయం నిర్వహించిన పరీక్షలో రెండు సాంస్కృతిక, ఒక మోడ్రన్ (ఇంగ్లీష్) పోస్టులకు ముగ్గురు ఎంపికైనట్లు తెలిపారు. సాంస్కృతిక పోస్టులకు డాక్టర్ సుభాష్ చంద్రబోస్, ఎస్.నరసింహరెడ్డి, ఇంగ్లీష్ పోస్టుకు కె.భారతి అర్హత సాధించారు.

యాదగిరిగుట్టలో మహాచండీయాగం

- 4వ తేదీ వరకు కార్యక్రమాలు



చండీహోమం నిర్వహిస్తున్న గొంగిడి సునీత, మహేందర్‌రెడ్డి దంపతులు

యాదగిరిగుట్ట : లోక కల్యాణార్థం, ఆలేరు నియోజకవర్గ ప్రజలందరూ సుఖ,సంతోషాలతో ఉండాలని యాదగిరిగుట్ట పట్టణంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో సోమవారం మహా చండీయాగాన్ని ప్రారంభించారు. వరుణ, వాయు పరమైన ప్రకృతి భయాలు తొలగి, లోకమంతా పాడిపంటలతో అభివృద్ధి చెందాలని ఐదు రోజుల పాటు మహా చండీయాగం నిర్వహించనున్నట్లు ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి దంపతులు వెల్లడించారు. కంచిపీఠ ఆస్థాన సిద్ధాంతి బ్రహ్మ శ్రీ పాండురంగశాస్త్రి, సుబ్రహ్మణ్య సిద్ధాంతి ఆధ్వర్యంలో 25 మంది వేద, స్మార్త, ఆగమ పండితులచే చండీయాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 4వ తేదీ వరకు మహా చండీయాగం కొనసాగుతుందన్నారు. మొదటి రోజు గణపతి పూజ, పుణ్యాహ వచనం, రుత్విగ్వరణం, దీక్షాధారణ, అరుణ పారాయణ, వేద పారాయణ, అగ్ని ప్రతిష్ఠాపన, మహా విద్యా హోమం, మన్యుకల్పహోమం, చండీహోమం, గణపతి యంత్రార్చన, కామాక్షీదీపార్చన, నవావరణార్చన వంటి పూజలు చేపట్టారు. యాగంలో భాగంగా మంగళవారం మహాచండికా హవనం, రాజశ్యామలా హవనం, శ్రీచక్రనవావరణార్చన మొదలగు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


వెంకన్న (ఫైల్)

చిలుకూరు : విద్యుదాఘాతంతో ఓ రైతు మృతిచెందాడు. చిలుకూరు మండల పరిధిలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన అనంతు వెంకన్న(44) రోజు వారీ పనిలో భాగంగా పొలానికి నీరు పెట్టేందుకు విద్యుత్ మోటారు ఆన్ చేశాడు. కరెంట్ లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లి ఫీజు వేస్తుండగా 11కేవీ విద్యుత్ వైరు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. వెంకన్న మృతితో జెర్రిపోతులగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వాహనదారుడికి తప్పిన ప్రమాదం

హాలియా : ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయిన ఓ వాహనదారుడు ప్రమాదశాత్తు ఎడమ కాల్వలో పడి సురక్షితంగా బయటపడ్డాడు. ఈ సంఘటన సోమవారం హాలియా పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హాలియా పట్టణంలోని జంగాల కాలనీకి చెందిన వెంకయ్య గ్యాస్ స్టౌవ్‌లు మరమ్మతులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తన బైక్‌పై వెంకయ్య పట్టణంలోని పలు ప్రాంతాలకు వెళ్లి తిరిగి వస్తూ హాలియాలోని ఎడమ కాల్వ వద్ద బ్రిడ్జిని దాడుతున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు బైక్‌తో సహా ఎడమ కాల్వలో పడ్డాడు. ఈ సమయంలో ఎడమ కాల్వకు నీటిని నిలుపుదల చేయడం వల్ల వెంకయ్యకు ప్రాణాపాయం తప్పింది. గమనించిన స్థానికులు కాల్వలో పడిన వెంకయ్యతో పాటు ద్విచక్రవాహనాన్ని బయటికి తీశారు.

మంత్రి జగదీశ్‌రెడ్డికి వినతి

నల్లగొండ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రేషన్ డీలర్ల సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పారేపల్లి నాగరాజు సోమవారం మంత్రి జగదీష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాగరాజు తెలిపారు.

ఇద్దరికి గాయాలు

అర్వపల్లి: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. జాజిరెడ్డిగూడెం, చింతపల్లి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కరీంనగర్ వైపు లోడుతో వెళ్తున్న లారీ అర్వపల్లికి వచ్చాక ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో వెనక వస్తున్న లారీ డ్రైవర్ విజ్జి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని..

చింతపల్లి : చింతపల్లికి చెందిన కొప్పుల చిన యాదయ్య వింజమూరు వైపు నుంచి సైకిల్‌పై చింతపల్లి మండల కేంద్రం వైపు వస్తున్నాడు. మార్గమధ్యలో భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా చింతపల్లి నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించడంతో పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

B.Tech, MBA, ITI, Polytechnic Diploma, @ Low cost. 9642096424

మూగజీవాలనూ వదలట్లే..!

- మేకలు, పశువులను అపహరిస్తున్న దొంగలు
- ఏడు నెలల్లో నల్లగొండ జిల్లాలో 22 కేసులు నమోదు
- 350 పశువులు, 50 మేకలను మాయం చేసిన దుండగులు
- పోలీసులకు తలనొప్పిగా మారిన కేసులు



పక్క చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు నాగరాజు. నల్లగొండ పట్టణ శివారు పానగల్ రోడ్డులోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉంటూ మేకల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. వెంకన్న గత శుక్రవారం సాయంత్రం బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి హాజరయ్యేందుకు ఊరికి వెళ్లాడు. శనివారం తిరిగి వచ్చే సరికి ఇంటి ముందు దొడ్డిలో ఉన్న మేకల మందలో రెండు కనిపించలేదు. దుండగులు అపహరించుకుపోయారని బాధితుడు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఒక వెంకన్న మేకలనే కాదు జిల్లాలోని ఆయా గ్రామాల్లో రైతులు, కాపరుల పశువులు, గొర్లు సైతం చోరీ చేస్తున్నారు.

నల్లగొండ క్రైం : గుర్తుతెలియని వ్యక్తులు మూగజీవాలను అపహరించుకుపోతున్నారు. వ్యవసాయ బావులు, ఇళ్ల సమీపంలోని దొడ్లను లక్ష్యంగా చేసుకుని మేకలు, పశువులను ఎత్తుకెళ్తున్నారు. గడిచిన ఏడు నెలల కాలంలో నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 22 కేసులు నమోదు కాగా, 350 పశువులు, 50 మేకలు మాయమైనట్లు పోలీసుల రికార్డులు వెల్లడిస్తున్నాయి.

వారాంతంలో భయం.. భయంగా..

నల్లగొండ సమీప గ్రామాల్లో జీవాలు కాసుకుంటూ



జీవనోపాధి పొందుతున్న రైతులు, కాపరులు వారాంతం (శుక్ర, శనివారాలు) వస్తే హడలిపోతున్నారు. గతంలో మునుగోడు, దేవరకొండ, చండంపేట, హాలియా, నల్లగొండలోని రాజీవ్ గృహకల్ప, పాతబస్తీలోని శ్రీకృష్ణనగర్, పానగల్ బైపాస్, శ్రీరాంనగర్ కాలనీల్లో గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి మేతమేస్తున్న మేకలను కారులో వేసుకుని పారిపోయిన ఘటనలు చాలా ఉన్నాయి. రాత్రి సమయాల్లో కరెంట్ పోతే చాలూ దుండగులు కాచుకుని బైక్ లేదా కారులో వచ్చి మేకలను చోరీ చేస్తున్నారు. నల్లగొండ పట్టణంలోని రాక్ హిల్స్ కాలనీలో ఇదే తరహాలో దుండగులు చోరీలకు పాల్పడ్డారు. అదే విధంగా ఆయా మండలాల పరిధిలో బావుల వద్ద, ఇళ్ల ఆవరణలో కట్టేసిన పశువులను కూడా దుండగులు అనువైన వాహనాల్లో వచ్చి అపరించుకుపోయిన ఘటనలు జిల్లాలో ఉన్నాయి.

మద్యానికి బానిసగా మారి..

ఎనిమిది మాసాల క్రితం నల్లగొండలోని రాక్‌హిల్స్ కాలనీలో కొందరు యువకులు కారులో వచ్చి మేకలను అపహరిస్తుండగా మఫ్టీలో కాపుకాసిన పోలీసులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే, పట్టుబడిన యువకులంతా మద్యానికి బానిసగా మారిన వారే ఉండడంతో అప్పట్లో వారి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. కొద్ది రోజుల క్రితం మేళ్లదుప్పల పల్లి రోడ్డులో పందులను చోరీ చేస్తున్నారని బాధితులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితుడిని హాలియాలో పట్టుకున్నారు. జిల్లా కేంద్రం శివారు ప్రాంతాల్లో కోళ్లు సైతం చోరీకి గురవుతున్నాయని పోలీసులకు ఫిర్యాదులు అందుతుండడంతో తలలు పట్టుకుంటున్నారు. నగదు, బంగారం చోరీ కేసుల్లోనే నిందితులను పట్టుకునేందుకు సరిపోను సిబ్బంది లేక సతమతమవుతుంటే మూగజీవాల అపహరణపై వస్తున్న ఫిర్యాదులు తలనొప్పిగా మారాయని ఓ పోలీస్ అధికారి వ్యాఖ్యానించారు.

చోరీ చేసిన గంటలోనే..

మేకలను అపహరించుకుపోయిన నిందితులు గంట వ్యవధిలోనే వాటి ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. యజమాని గుర్తుపట్టకుండా మేక తోలు తీసేయడం, తలను వేరు చేసి ఆధారాలు లేకుండా చేస్తున్నారు. తమ ఇంట్లో శుభకార్యం చేస్తున్నామని బంధువులు తక్కువ సంఖ్యలో వచ్చారని, అనవసరంగా రెండు మేకలను కోశామంటూ మాంసం విక్రయదారులకు తక్కువ ధరకు అమ్మేస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సీసీ కెమెరాలు ఉంటేనే..

నల్లగొండలోని రాజీవ్ గృహకల్ప వద్ద దుండగులు మేకలను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి కటకటాల వెనక్కి నెట్టారు. అదే విధంగా శ్రీరాంనగర్‌లో సైతం కోళ్లను మాయం చేస్తున్న వారిని సీసీ కెమెరాలో గుర్తించి అరెస్ట్ చేశారు. సీసీ కెమెరాల ఆధారంగానే మూగజీవాలను ఎత్తుకెళ్లే నిందితులను గుర్తించే అవకాశం ఉంటుందని పోలీసులు అంటున్నారు. గ్రామాలు, పట్టణాల్లోనే వీధులు, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

కూతురు బతుకు ఆగమైందని..

- మనస్తాపంతో పురుగుల మందు తాగిన తల్లి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

నకిరేకల్ : కూతురు బతుకు ఆగమైందని మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నకిరేకల్‌లోని కాటమయ్య బజారుకు చెందిన దొమ్మాటి రామలక్ష్మయ్య రిటైర్డ్ టీచర్. ఇతడి భార్య మంగమ్మ అలియాస్ మమత (48) వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెల వివాహం జరిగినప్పటికీ పెద్ద కూతురు ఉషారాణి నాలుగేళ్ల క్రితం విడాకులు తీసుకుంది. అప్పటి నుంచి ఆమె తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. చిన్న వయసులోనే కూతురుకు విడాకులు తీసుకోవడంతో తల్లి మంగమ్మ మానసికంగా కుంగిపోయి ఈనెల 29న శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. అపస్మారస్థితిలో పడి ఉన్న ఆమెను పక్కింట్లో ఉంటున్న సోదరుడు జనార్దన్ చూసి తొలుత స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి నల్లగొండ, హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రెండు రోజుల చికిత్స అనంతరం ఆమెను సోమవారం నకిరేకల్‌కు తీసుకువచ్చారు. ఇంటికి వద్దకు వచ్చిన తరువాత


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


మంగమ్మ (ఫైల్)

మరోసారి మమత అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మంగమ్మ మృతి చెందిందని డాక్టర్లు నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. మృతురాలి భర్త రామలక్ష్మయ్య ఫిర్యాదు మేరకు సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపారు. కాగా, మంగమ్మ మృతదేహానికి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో పాటు నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, టీపీసీసీ నేత దైద రవీందర్ నివాళులర్పించి సంతాపం తెలపారు.

ఇంటిపై దాడి.. సామగ్రి ధ్వంసం

నడిగూడెం: మండలంలోని బృందావనపురంలో పోతురాజు నాగేశ్వరరావు ఇంటిపై సోమవారం అదే గ్రామానికి చెందిన పుట్లా రామాంజనేయలు తదితరులు దాడిచేసి సామగ్రిని ధ్వంసం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బృందావనపురం గ్రామానికి చెందిన పోతురాజు నాగేశ్వరావు కుమారుడు మహేష్ అదే గ్రామానికి చెందిన ఓ యువతిని జూలై 24న ప్రేమ వివాహం చేసుకున్నాడు. అనంతరం తమ వివాహానికి యువతి తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదని పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు రెండు కుటుంబాల పెద్దలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. యువతి తాను ప్రేమించిన వ్యక్తితోనే ఉంటానని చెప్పడంతో ఆగ్రహించిన ఆమె తరఫు బంధువులు మహేష్ ఇంటిపై దాడి చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

- పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్‌ఠాక్రే

నకిరేకల్: నకిరేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావ్ ఠాక్రే సూచించారు. నకిరేకల్‌కు చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్‌లు సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయనను కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చామల శ్రీనివాస్, పీసీసీ డెలిగేట్ సుంకరబోయిన నర్సయ్యయాదవ్, సీనియర్ నాయకులు జటంగి వెంకటనర్సయ్య, లింగాల వెంకన్న, యాస కర్ణాకర్‌రెడ్డి, జమీరుద్దీన్, సాల్వేర్, అశోక్, బొప్పని యాదగిరి, పల్‌రెడ్డి ఉపేందర్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, ముక్కాముల శేఖర్, బడుగుల చంద్రశేఖర్, మేడి విజయ్ ఉన్నారు.


హైదరాబాద్‌లో మాణిక్‌రావ్ ఠాక్రేను సన్మానిస్తున్న నకిరేకల్ కాంగ్రెస్ నాయకులు

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

భువనగిరి : రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన రాయగిరి రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయగిరి–వంగపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య రాయగిరి రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉదయం గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు ఉన్నట్లు తెలిపారు. మృతుడి శరీరంపై తెలుపు రంగు ఫుల్ చొక్కా పై బ్లూ చెక్స్ ఉన్నాయి. బ్లూ రంగు పాయింట్ ధరించి ఉన్న వ్యక్తి హిందువులా ఉన్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎస్ సత్యనారాయణ తెలిపారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గురుకుల పాఠశాల విద్యార్థి హల్‌చల్

మోత్కూరు : గురుకుల పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థి గోడ దూకి పరారై హల్‌చల్ సృష్టించాడు. ఈ సంఘటన మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. విద్యార్థుల కథనం ప్రకారం.. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో కొత్త బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న ఓ భవనంలో ఎస్సీ గురుకుల బాలుర పాఠశాలను వడ్డెర కాలనీలోని మరో భవనంలో నిర్వహిస్తున్నారు. బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న భవనంలో 5 నుంచి 7 తరగతుల వరకు తరగతులను నిర్వహిస్తున్నారు. 5వ తరగతి విద్యార్థి అఖిలానందన్ సోమవారం ఉదయం గురుకుల పాఠశాల ప్రహరీ దూకి సమీపంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లి అక్కడి నుంచి నల్లగొండ బస్సు ఎక్కి వెళ్లాడు. అప్పటికే సమాచారం పొక్కడంతో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. బస్టాండ్ కంట్రోలర్ శ్రీనివాస్ ద్వారా బస్సు కండక్టర్ సహాయంతో అఖిలానందన్ విద్యార్థిని బస్సులోనే పట్టుకున్నారు. హాలియాకు చెందిన అతని తల్లిదండ్రులను రప్పించి పరారైన విద్యార్థిని నల్లగొండలో అప్పగించినట్లు ప్రిన్సిపాల్ వెంకటనర్సయ్య తెలిపారు.

మహిళలను దూషించిన వ్యక్తికి మూడు నెలల జైలు, జరిమానా

నిడమనూరు: ఇంటికి ఫోన్ చేసి మహిళలను దూషించిన వ్యక్తికి మూడు నెలల జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ నిడమనూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి స్వప్న సోమవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజన్ ఆఫీసర్ అలీ మహ్మద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన కర్నె మోహన్ రెడ్డి ఇంటికి త్రిపురారం మండలం గంటారావ్ క్యాంపునకు చెందిన ముధావత్ శ్రీధర్ ఫోన్ చేసి అతని భార్య, అమ్మమ్మను అసభ్యకరంగా తిట్టాడని 2017 ఏప్రిల్ 8న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్‌ఐ అరీఫ్ కేసు నమోదు చేసి శ్రీధర్‌ను కోర్టులో రిమాండ్ చేశాడు. శ్రీధర్‌పై నేరం నిరూపణ కావడంతో జడ్జి మూడునెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని అలీ తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వానికి నిరుద్యోగులపై చిత్తశుద్ధి లేదు


మాట్లాడుతున్న బుర్ర శ్రీనివాస్‌గౌడ్

మోత్కూరు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నిరుద్యోగులపై చిత్తశుద్ధి లేదని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ గురుకుల రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించనున్న పరీక్షల తీరే ఇందుకు నిదర్శనమని అన్నారు. సోమవారం మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న నోటిఫికేషన్లలో ఈ పరీక్షలకు రాష్ట్రంలో లక్షలాది మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో వరుసగా మూడు పరీక్షలు రాసే అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వరుసగా మూడు పరీక్షలు రాసే అభ్యర్థులు ఒక్కొక్క జిల్లాలో ఒక్కో పరీక్ష రాయాలంటే మహిళా అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి ఒకే జిల్లాలో మూడు పరీక్షలు రాసే విధంగా అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర నాయకులు అవిశెట్టి అవిలుమల్లు, బయ్యని రాజు, నిమ్మల శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు నిలిగొండ మత్స్యగిరి, నిరుద్యోగ అభ్యర్థులు రాజు, నర్సింహ పాల్గొన్నారు.

ట్రాక్టర్ కిందపడి రైతు, డ్రైవర్ దుర్మరణం

- పొలం దున్నుతుండగా బురద మడిలోనే ఘటన
- జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లిలో విషాదం


బురద పొలంలో ట్రాక్టర్ టైర్ల కింద మృతదేహాలు

అర్వపల్లి: బురదమడి దున్నుతున్న క్రమంలో తొలుత రైతు...ఆ వెంటనే డ్రైవర్ ట్రాక్టర్ కింద పడి దుర్మరణం చెందారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లిలో చోటుచేసుకున్న ఈ విషాదకర ఘటనపై పోలీసులు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పర్సాయపల్లి గ్రామానికి చెందిన రైతు దండ భద్రారెడ్డి వద్ద బొల్లంపల్లి గ్రామానికి చెందిన పసుల రామలింగయ్య(52) రెండు నెలల నుంచి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం పర్సాయపల్లికి చెందిన రైతు మిడతపల్లి మల్లయ్య తన ఎకరం వ్యవసాయ భూమిలో వరిపొలం సాగు చేయడానికి భద్రారెడ్డి వద్దకు వెళ్లగా డ్రైవర్ రామలింగయ్యను పొలం దున్నడానికి పంపించాడు. డ్రైవర్ రామలింగయ్య ట్రాక్టర్ ఇంజన్‌కు నాగలి, ఇనుప చక్రాలు బిగించుకొని వెళ్లి మడి దున్నడం ప్రారంభించాడు. బురదమడిలో ట్రాక్టర్‌ను వెనుకకు ముందుకు ఆడిస్తుండగా వెనుక వైపు నుంచి పొలం గట్టు మీద ఉన్న రైతు మల్లయ్య కాలు జారి ప్రమాదవశాత్తు మడిలో పడిపోయాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ ఇనుప చక్రాలు (వీల్స్) మల్లయ్య కాలుపైనుంచి పోవడంతో ఒక్కసారిగా కేకలు వేస్తూ



మల్లయ్య, రామలింగయ్య (ఫైల్)

భయంతో గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. రైతు మల్లయ్య కేకలు విన్న డ్రైవర్ రామలింగయ్య షాక్‌కు గురై వెంటనే వెనుక ఏమి జరిగిందోనని చూస్తూ కిందికి దిగుతున్న క్రమంలో ఒక కాలు ఇంజన్ క్లచ్‌లో ఇరుక్కుపోయి కిందికి పడి తల బురదలో టైరు, వీల్ కింద పడి ఊపిరాడక క్షణాల్లోనే మరణించాడు. అయితే డ్రైవర్ రామలింగయ్యకు కొంత కాలంగా మూర్ఛ(ఫిట్స్) ఉండటంతో ఇలా జరిగి ఉండవచ్చని ప్రజలు అనుమానిస్తున్నారు. సమీపంలోని రైతులు ప్రమాదాన్ని చూసి గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్‌ఐ అంజిరెడ్డి సంఘటనా స్థలికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదులు తీసుకొని కేసుదర్యాప్తు చేస్తున్నారు. మృతులు మల్లయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. రామలింగయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రామలింగయ్య ఇద్దరి కుమార్తెల వివాహం చేయగా చిన్న కూతురి వివాహం కావాల్సి ఉంది.


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

రెండు గ్రామాల్లో విషాదఛాయలు

రైతు మలయ్య స్వగ్రామం పర్సాయపల్లి, డ్రైవర్ రామలింగయ్య స్వగ్రామం బొల్లంపల్లి గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. రెండు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో సంఘటనా స్థలానికి తరలి వచ్చి ఇద్దరు మృతి చెందిన పరిస్థితిని చూసి కంటతడి పెట్టారు. ఒకరెనక ఒకరు మృతిచెందడం, ఇద్దరి మృతదేహాలు పక్క పక్కనే ఉంచడంతో మృతుల కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. సంఘటనా స్థలానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు పుప్పాల శేఖర్, దానం సుజాతయాదగిరి, మాజీ జెడ్పీటీసీ కొ్రపిడత అవిలయ్య, మాజీ ఎంపీపీ పంది ఎర్రనర్సయ్య, ఎంపీటీసీ రాచకొండ గీతాసురేష్, మాజీ సర్పంచ్ భరత్‌రెడ్డి, దేవస్థాన డైరెక్టర్ తోట నర్సయ్య, దండ వీరారెడ్డి తదితరులు చేరుకొని నివాళులర్పించి మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..


జంగయ్య (ఫైల్)

చింతపల్లి : గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి మండలం గొల్లపల్లి పరిధిలోని సమైక్యనగర్ కాలనీకి చెందిన కునేరెడ్డి జంగయ్య(40) ఆదివారం రాత్రి చింతపల్లి వైపు నుంచి మాల్ వైపునకు మోటారు సైకిల్ వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో కుర్మేడు సమీపంలో గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

6న ఆత్మీయ సమ్మేళనం

నల్లగొండ టౌన్ : ఏఐఎస్‌ఎఫ్ మాజీ విద్యార్థి సంఘం నాయకుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఈ నెల 6న నాగార్జునసాగర్ విజయ్‌విహార్ అతిథి గృహంలో నిర్వహిస్తున్నట్లు సంఘం మాజీ సీనియర్ నాయకులు కట్ట వెంకట్‌రెడ్డి తెలిపారు.. సోమవారం స్థానిక ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో యూనివర్సిటీ, మెడికల్ కళాశాల కోసం ఏఐఎస్‌ఎఫ్ విరోచిత పోరాటం చేసిందని గుర్తుచేశారు. మాజీ ఏఐఎస్‌ఎఫ్ నాయకులు విధిగా హాజరై సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పల్లా దేవేందర్ రెడ్డి, గుర్రంవెంకట్‌రెడ్డి, జిల్లా యాదయ్య, ముదిగొండ మురళీకృష్ణ, గుండా లింగారెడ్డి, సూర్య తేజ పాల్గొన్నారు.

రైతులు వరినారు శుద్ధి చేసుకోవాలి

మోత్కూరు : మున్సిపల్ పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో నల్ల మధుసూదన్‌రెడ్డి వ్యవసాయ పొలంలో సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీకి చెందిన తృతీయ సంవత్సరం విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. వరి పొలంలో జీవ ఎరువుల ఉపయోగం గురించి వారికి వివరించారు. జీవ ఎరువుతో నాటు వేసుకునే ముందు నారును శుద్ధి చేసుకోవడం వల్ల వేర్లు బాగా అభివృద్ధి చెంది భూమిలో స్థిరీకరణమైన పాస్ఫరస్‌ను మొక్కలకు అందజేస్తుందని తెలిపారు. జీవ ఎరువును ఉపయోగించడం వల్ల పాస్ఫరస్ ఎరువుల వాడకాన్ని తగ్గిస్తుందన్నారు. జీవ ఎరువుల వలన భూమి సారవంతమవుతుందన్నారు. ఒక కిలో పాస్ఫరస్ 10–15 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకు సరిపోయే నారును శుద్ధి చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వ విద్యాలయం కళాశాల విద్యార్థులు డి.శిరీష, కె.ధరణి, జె.సునయన, మిస్బాసుల్తానా, ఎస్.నాగసాయి, మౌనిక పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

నిత్యావసర సరుకులు ఎమ్మార్పీకే విక్రయించాలి

- నల్లగొండ అదనపు కలెక్టర్ శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ : నిత్యావసర సరకులు ఎమ్మార్పీకే విక్రయించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ వర్తక సంఘం ప్రతినిధులను కోరారు. నల్లగొండ అదనపు కలెక్టర్ సోమవారం తన చాంబర్‌లో నిర్వహించిన ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడారు. సామాన్యుడికి భారంగా మారుతున్న నిత్యావసర సరకుల విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. షాపుల్లో నిత్యావసర సరకుల స్టాక్, రేట్ల పట్టిక ప్రదర్శించాలని ఆదేశించారు. కూరగాయల్లో ముఖ్యంగా టమాటా, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డల కొనుగోలులో దళారీ వ్యవస్థని పూర్తిగా అడ్డుకోవాలని, విధిగా కూరగాయల వ్యాపారులు రేట్లను ప్రదర్శించి విక్రయించాలన్నారు. మార్కెట్లో కూరగాయల కొరతను సృష్టించి, అధిక రేట్లకు అమ్ముతున్నట్లు తెలుస్తోందని, దీనిపై అధికారులు వర్తకులు, సమన్వయంతో ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అదేవిధంగా కొంతమంది వ్యాపారులు పప్పు దినుసులు, నూనెల కొరత సృష్టించడంతో పాటు, స్టాక్‌ను మార్కెట్ రేటుకు కాకుండా ఎక్కువ రేట్లకు విక్రయిస్తున్నారని ఇది ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. అన్ని రకాల వర్తక వ్యాపారులు తమ షాపుల వద్ద పప్పు దినుసులు, నూనెల రేట్లు విధిగా ప్రదర్శించాలన్నారు. మున్సిపాలిటీ, పౌరసరఫరాల, ఆహార తనిఖీ, తూనికల కొలతల అధికారులు బృందంగా ఏర్పడి తనిఖీలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల డీఎం నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ సుచరిత, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి, మార్కెటింగ్ ఏడీ శ్రీకాంత్, డీసీఐసీ కన్వీనర్ గురువయ్యా, హిమగిరి, వర్తక సంఘం ప్రతినిధులు రవికుమార్, ఆర్ సత్యనారాయణ, పి.ప్రసాద్, రేషన్ షాప్ డీలర్లు వైద్యుల సత్యనారాయణ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

■ కోదాడ నయానగర్‌లో 221 చ॥గజాల లో నూతనంగా నిర్మించబడిన డబుల్ బెడ్‌రూం ఇల్లు అమ్మకానికి కలదు. సంప్ర॥ 9966664245, 9542289507 [Y-784376]

VILLAS FOR SALE

■ Best Gated Community In Nalgonda District, Superb Villas Reasonable Priced Must See, Fully Ready. Contact :9440467666 [H-788553]

■ Ready to Occupy Duplex Luxury Villas in the Best Gated Community at Miryalaguda, Next to New Dmart, Club House, Swimmingpool, Fully Operational Must See Call: 7013578378 [H-788552]

Wanted

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221475]

■ INC ఆఫీస్ నందు పనిచేయుటకు యువతి యువకులు కావలెను. P/T-9K / F/T - 24K. ఇతర వివరాలకు ✆ 9848669434 [G-786475]

■ Required for Power Plant. Boiler (1 & 2 Class DCS) Turbine Field, Electrical, Instrumentation, AFBC Boiler & Turbine Maintenance. Exp.min 3y. 78427 05192 [B-190721]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్ 9640258899, 9640468899 [HA-189314]

ప్రకటన కోరండి! స్పందన పొందండి!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. :220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
వివరాలకు
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
నకిరేకల్ : 9010178203
సూర్యాపేట : 9912220740, 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.